# ఋణం

మాధవరావ్ అసహనంగా గడియారం కేసి చూశాడు. ఎనిమిదీ ఇరవై నిముషాలు!

"ఓ గాడ్! యిరవై నిముషాలు వేస్టు- ఏమైందీ శివరావు కివ్వాళ?" లోలోపల గొణుక్కున్నాడు. చిరాగ్గా అటూ, యిటూ పచార్లు చేయ నారంభించాడు.

'పంక్చుయాలిటి' ని ఊపిరి పీల్చడమంత ముఖ్యంగా భావించే వాళ్ళలో మొదటివాడు మాధవరావు.

అవతలివాళ్ళతో పేచీ వచ్చేది అక్కడే?

అతనితో అవసరం ఉన్నవాళ్ళు అయిష్టంగానో, అతికష్టం మీదనో, అతని అభీష్టాని కనుగుణంగా సెకండ్ల ముల్లు వెంట పరుగులు తీస్తారు.

లేకపోతే- రెండోమాటు వాళ్ళకి పలుకడు.

బాల్య స్నేహితుడిగా శివరావుకి సంగతి బాగా తెలుసు.

మరెందుకిలా నిరీక్షణలో కూర్చోబెట్టి శిక్షిస్తున్నాడు?

శివరావు కాకుండా, చివరికి భార్య అయినా మాధవరావు అయిదు నిముషాలకి మించి ఎన్నడూ నిరీక్షించలేదు.

అలాంటిది- యిరవై నిముషాలు!

సునాయాసంగా మూడో ప్రపంచయుద్ధం ఆరంభమై పూర్తి కాగలంత సమయం.

శివరావు తత్వం బాగా ఎరిగుండటం చేత, తెగించి వెళ్ళలేక పోతున్నాడు. అవతల తన రాకకోసం కాన్ఫరెన్సు నిలిపి ఉంచుతారు డైరెక్టర్లు.

ఎప్పుడూ తనని చూసి గడియారాలు సరిజేసుకునే సభ్యులు, యీ రోజు కళ్ళ కెదురుగా వాళ్ళ గడియారా లుంచుతారేమో!

శివరావు ఎప్పుడూ యిలా చెయ్యలేదే!

తను ఒకగంట క్రితం ఫోనులో విన్న శివరావు గొంతు పదే పదే అవే పలుకుల్ని చెవుల్లో ప్రతిధ్వనించిన జేస్తున్నట్లుందింకా,

"ఎనిమిది గంటలకి అక్కడుంటాను. వచ్చేదాకా అగు... చాలా అర్జంట్..." అవీ శివరావు మాటలు.

ఆ తర్వాత ఫోను కట్ చేసాడు.

తనకు తెలిసినంతలో శివరావు డిక్షనరీలో 'అర్జంటు' అనే మాట లేదు. ఈ రోజే

అతని నోటివెంట ఆ మాట వినటం!

ప్రతి పనీ చాలా నిదానంగా చేస్తాడతను.

చిన్నప్పట్నుంచీ అంతే.

పెళ్ళయినా, తండ్రయినా అలాగే ఉండిపోయాడు.

ఉన్నాడు గనకే పోలియో వ్యాధికి సకాలంలో వైద్యం జరిపించక కూతురు రేవతిని శాశ్వతంగా అవిటిదనానికి అప్పగించాడు.

ఈ మాట అనటానికీ, వినటానికీ చాలా ఘోరంగా ఉంటుంది.

అయినా- బయట ప్రపంచానికి అతనేమిటో తెలియకుండా జాగ్రత్తపడటంలో అతని కతనే సాటి.

ఎప్పుడూ ఎవర్నీ పైసా కూడా యాచించడు. ఒకవేళ వాళ్లే యిచ్చినా పుచ్చుకోడు. వస్తులున్నా- పంచభక్ష్య పరమాన్నాలు తింటున్న వాడిలాగానే కనిపిస్తాడు.

అంతటి ఆత్మనిగ్రహం గలవాళ్ళు చాలా అరుదు.

అందుకే- ఎందరో మిత్రుల మధ్య, చుక్కల్లో చంద్రుడిలా విశిష్టంగా కనిపిస్తాడు శివరావు!

మిత్రుడి గురించి తలుచుకుంటుంటే మాధవరావ్ మనసు ఆర్ద్రతతో పొంగిపోయింది.

ఒక్కోమాటు అతని పద్ధతులు విసుగు, కోపాన్నీ కూడా కల్గిస్తుంటాయి మాధవరావ్‌కి.

తను బాధలు పడటం అటుంచి, తనతోబాటు యిల్లాలునీ, కూతుర్నీ కష్టాలకి గురిచేస్తున్నా డనిపిస్తుంది.

లేకపోతే పాతికేళ్ళొచ్చినా కూతురికి పెళ్ళి చేయకపోవటం ఏమిటి?

అలాగని- అధిక సంతానపు బాధలతో సతమత మవుతున్నాడా అంటే, ఒక్కగానొక్క కూతురు రేవతి!

పున్నామ నరకంనుండి రక్షించడానికి ఒక్క కొడుకు కూడా లేడు.

ఆ పిల్ల అవిటిది గనక, మామూలు కన్నా మరో మూడు వేలు పారేస్తే మంచి మొగుణ్ణే కొనుక్కు రావచ్చు.

లేదూ- అయిదువేలు!

అయితే మాత్ర మేమిటి?

ఇవతల లక్షల్ని పెంచుకుంటున్న ఆప్తమిత్రుడు తను లేడూ?

వాడు కోరాలే కానీ, తను పరమ సంతోషంగా ఎంతటి పనైనా చిటికెలో చేసి పారేస్తాడు.

ఆ స్తోమతు తనకుంది.

కానీ- ఆ వివేకం వాడికి లేదు.

అదే ఉంటే, ఎప్పుడో బాగుపడే వాడు.

అప్పటికీ మనసు ఊరుకోక, కన్పించినప్పుడల్లా పోరుతూనే ఉన్నాడు.

తన బాధకి తట్టుకోలేక చివరికొక రెండో పెళ్ళివాణ్ణి తీసుకొచ్చాడు.

వాడికి దాదాపు నలభై యేళ్ళు. (ఇంకా తక్కువ చెప్పిన గుర్తు) చూట్టానికింకా ముసలాడిలా ఉన్నాడు.

మొదటి పెళ్ళాం పోయి అయిదేళ్ళయిందట. (చచ్చిపోయిందో, లేచి పోయిందో స్పష్టంగా చెప్పలేదు...)

ఇద్దరు పిల్లలున్నారట.

ముసలి తల్లి ఉందిట.

"కట్నం ఆశలేమీ లేవు (ఉన్నా ఎవడిస్తాడు గనక) ఇంట్లో ఒక మనిషి (ఏ మనిషో-పనిమనిషో లేక వంట మనిషో) అవసర మనిపించి పెళ్ళి చేసుకుందా"మని బయల్దేరగా, శివరావు తారసిల్లాడట!

"బాగానే ఉంది. ఏ సంగతీ ఉత్తరం ద్వారా తెలియజేస్తాం. వెళ్ళిర"మ్మని సాగ నంపాక వీరభద్రుడిలా విరుచుకు పడ్డాడు శివరావు మీద.

తనకి బి.పి. ఉన్న సంగతి తెలుసు గనుక, అలాంటి వేమీ లేని శివరావు ప్రశాంతంగా ఆ పడగళ్ళ వానలో 'సోక్రటీస్' లా కూర్చున్నాడు.

అంతా విన్నాక, "ఈ రోజుల్లో అవిటి దాన్ని కట్టుకునేవాడు యింతకంటే గొప్పవాడెలా వస్తాడ్రా? చేతులారా సంబంధం చెడగొట్టావ్..." అన్నాడు శివరావ్, చివరికి.

చడామడా మరో అయిదు నిముషాలు తిట్టాక "చూడొరేయ్! నీవల్ల కాదంటే రేవతిని మా యింట్లో దించు. నా కూతురే అనుకుని అన్నీ చేస్తాను. కానీ, యిలాంటి వెధవ సంబంధాలు తెచ్చావంటే మాత్రం ఊరుకోను. తెలుగు దేశంలో యింతకంటే మంచి పెళ్ళి కొడుకులే దొరకలేదుట్రా నీకు?" అని గదమాయించాడు.

శివరావు మెత్తగా నవ్వేసాడు.

అలాంటి హిమశిల శివరావంటే! వాణ్ణి కరిగించటం ఒకపట్టాన సాధ్యం కాదు.

"మధూ!"

ఉలిక్కిపడి ప్రస్తుతంలోకి వచ్చాడు మాధవరావ్.

"అరే- ఎంతసేపైంది వచ్చి?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఇప్పుడే వస్తున్నాను..."

మాధవరావ్ అప్రయత్నంగా టైముచూసేడు.

అవును- చెప్పిన టైముకి అరగంట అలస్యంగా వచ్చాను. అయామ్ వెరీసారీ! నావల్ల నీ పనులు ఆగిపోయి ఉంటాయి..."

"ఇట్సాల్ రైట్! ఇంతకీ ఏమిటి, ఏదో అర్జంటన్నావ్?" కుతూహలాన్ని దాచుకోలేక అడిగాడు, మాధవరావ్.

ఒక్క క్షణం శివరావ్ తన గొంతు నెవరో బలవంతంగా నులిమివేస్తున్నట్టు మాటలు పెగలక కొట్టుమిట్టాడేడు. క్రమంగా కోలుకుని మంద్రస్వరంతో అన్నాడు.

"మధూ! మనిద్దరం బాల్యస్నేహితులం. నా గురించి నీకు తెలియందిలేదు. నా జీవితం చిన్నతనం నుండీ దుఃఖభాజనంగా గడిచిపోయింది. నాకు నేనే ఓదార్చుకుంటూ, పెదవుల మీద నవ్వు పులుముకుంటూ, ప్రపంచం ముందు నటిస్తున్నాను. నాలో పేలే అగ్నిపర్వతాల ధ్వనినీ. వ్యక్తిగతంగా నేను పొందే హింసనీ ఎరిగున్నవాడివి నాకీ ప్రపంచంలో నువ్వొక్కడివే.

అందుకే నీముందు నేను మేకప్‌లేని నటుణ్ణి!

భార్యా బిడ్డలు ఋణానుబంధాల రూపమని పెద్దల వాక్కు.

తమాషా ఎక్కడంటే- వాళ్ళ ఋణం తీర్చుకోడానిక్కూడా మళ్ళీ ఋణం చేయాల్సి వస్తోంది!

నీకు తెలుసు- ఋణం చెయ్యడమంటే నాకు ఆత్మహత్యతో సమానమని.

కానీ- యిప్పుడు నేను చచ్చిన వాడితోనే సమం!

ఎందుకంటే నామీద ఉన్న బాధ్యతల్ని సక్రమంగా ఏ ఒక్కటీ నిర్వర్తించలేని అసమర్థుణ్ణి గనక!"

"నువ్వు దేని గురించి యింత ఉపోద్ఘాతం చెబుతున్నావో నాకర్థం కావటంలేదు! నీ బాధంతా రేవతి పెళ్ళి గురించే అయితే, దానికి పరిష్కారం లోగడే చెప్పాను. రేవతి నా కూతురు లాంటిది. ఆ పిల్లని అత్తవారింటికి సాగనంపే బాధ్యత నాది! ఆ ఖర్చుని నువ్వు ఋణంగా భావించనక్కర్లేదు..."

శివరావు కళ్ళవెంట నీళ్ళు జలజల రాలేయి.

"అవును- రేవతిని సాగనంపే బాధ్యత నీదన్నావనే వచ్చాను!"

"ఏమిటీ? అయితే, రేవతికి వరుడు దొరికేడా?" సంభ్రమంగా అడిగేడు మాధవరావ్.

"దొరికేడు మధూ! యీ తెల్లవారు ఝామునే మృత్యువు దానికి వరుడుగా దొరికేడు...! నా దగ్గర చిల్లిగవ్వ లేదు. ఆసుపత్రి బిల్లు కడితేగానీ శవాన్నివ్వరట... అప్పుడు నువ్వు గుర్తొచ్చావ్... వెంటనే ఫోనుచేసి, నడిచి వచ్చాను మధూ! అందుకే... ఈ ఆలస్యం..." చేతుల్లో మొహం దాచుకున్నాడు శివరావ్, రోదిస్తూ.

మాధవరావు చేష్టలు దక్కి నిలబడి పోయాడు.